



కార్యాలయం వర్ధన్నపేటలోనే.. కానీ
అధికారులు ఎక్కడ?

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -53 శనివారం 25 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

**ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు**

**పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ**

**క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సిఎం రేవంత్ సమీక్ష**



**హైదరాబాద్, జులై 24.(జర్నలిస్ట్ వార్త)**
నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం **మిగతా 2లో...**

# 10 ఏళ్ల జైలు, 10 కోట్ల జరిమానా..

**పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం.. -పేపర్ లీకేజీ చట్టాన్ని కఠినతరం చేయనున్న కేంద్రం**

**దోషులకు 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా సవరణలు**

**నీట్-యూజీ వంటి పరీక్షల లీకేజీల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు**



**న్యూఢిల్లీ,జులై 24.(జర్నలిస్ట్ వార్త)**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్ష పత్రాల లీకేజీల నివారణకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటోంది. పబ్లిక్ పరీక్షల (అక్రమ మార్గాల నివారణ) చట్టం-2024కు సవరణలు చేస్తూ, దోషులకు మరింత కఠిన శిక్షలు విధించే ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ శుక్రవారం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నూతన సవరణల ప్రకారం, ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడే వారికి గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.10 కోట్ల వరకు భారీ జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం ప్రకారం వ్యక్తిగత అక్రమాలకు మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష,**మిగతా 2లో...**

# సింగరేణి విస్తరణకు ప్రభుత్వం నిర్ణయం

**రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌లోకి సింగరేణి విస్తరణ**

**సింగరేణి భవిష్యత్తుకు అండగా ప్రజా ప్రభుత్వం**

**బొగ్గే కాకుండా.. కొత్త రంగాల్లోకి సింగరేణి**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**




**భద్రాద్రి కొత్తగూడెంజులై 24.(జర్నలిస్ట్ వార్త)**
సింగరేణిని కాపాడుకోవడానికి, బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ స్థాయికి విస్తరించడానికి ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతుగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి అభివృద్ధి కోసం ప్రభుత్వం తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటుందని భరోసా కల్పించారు. రాబోయే 15 - 20 ఏళ్లలో ఇంధన రంగం స్వరూప స్వభావాలు పూర్తిగా మారబోతున్నాయని ఆయన అన్నారు. **మిగతా 2లో...**

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సుముఖంగా లేని కేంద్రం


**నీట్ లీక్ వివాదంలో ప్రధాన్ రాజీనామాకు పట్టుబడుతున్న సీజేపీ**

**నష్టపరిహారం, కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం సూత్రప్రాయ అంగీకారం**

**ప్రధాన్ రాజీనామాపై శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరిన కేంద్రం**

**మంత్రి రాజీనామా చేస్తేనే ఆందోళన విరమిస్తామని విద్యార్థుల స్పష్టీకరణ**

2లో.



# కాక్రోచ్ ఆందోళనలకు బీఆర్ఎస్ సంఘీభావం

**కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే**

**ఇందిరాపార్క్ ధర్నాలో కెటిఆర్ డిమాండ్**

**హైదరాబాద్, జులై 24.(జర్నలిస్ట్ వార్త)**
ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. యువత జవాబుదారీతనం కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన **మిగతా 2లో...**




# ఎన్‌టీఏ ప్రక్షాళన..

**47 మంది అధికారులపై వేటు**

**విశ్వసనీయతను పునరుద్ధరించే చర్యల్లో భాగంగా 47 మంది అధికారుల తొలగింపు**

**పరీక్షల నిర్వహణకు సంబంధించిన అవుట్‌సోర్సింగ్ విధానంలోనూ సంస్కరణలు**

**నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు భారీ మార్పులకు సన్నాహాలు**




2లో.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు

**ఉన్నతాధికారులకు సిఎం రేవంత్ అదేశాలు**



**హైదరాబాద్ జులై 24.(జర్నలిస్ట్ వార్త)**
డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని ఉన్నతాధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. డ్రగ్స్ నిరోధంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి **మిగతా 2లో...**

# కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్రానికి లేఖ

**జల్ శక్తి మంత్రిత్వ శాఖ, ఎన్‌డీఎస్‌ఏ నుంచి మార్గదర్శకాలు కోరాలి**

**ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే ఫ్రీ-ఫ్లో మోడ్‌లో బ్యారేజీలు**

**పూర్తి సాంకేతిక నివేదికల ఆధారంగానే తుది నిర్ణయం**

**అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



# నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు

**విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్రం అహర్నిశలు కృషి చేస్తోందన్న బండి సంజయ్**

**నీట్ ఘటనపై మోదీ తీవ్రంగా కలత చెందారని వ్యాఖ్య**

**ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణ చెప్పారన్న బండి సంజయ్**

**హైదరాబాద్, జులై 24.(జర్నలిస్ట్ వార్త)**
ఢిల్లీలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన... విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని స్పష్టం చేశారు. నీట్ ఆందోళనల ముసుగులో దేశంలో అరాచకాలు సృష్టించేందుకు కొన్ని**మిగతా 2లో...**



## కాక్రోచ్ ఆందోళనలకు
# బీఆర్ఎస్ సంఘీభావం

**మొదటిపేజీ తరువాయి**

కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత పోరాటానికి బీఆర్ఎస్ తరఫున కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోందన్నారు. యువతపై జరుగుతున్న దాడులను దారుణమని తీవ్రంగా ఖండించారు. ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే ప్రధాని మోదీ పెట్టుకున్నారని.. ఈ జనరేషన్ చావుకు, ఐటీ, ఈడీ సోదాలకు భయపడేది కాదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ.. మేక్ ఇన్ ఇండియా అడిగితే లీక్ ఇన్ ఇండియా ఇచ్చారంటూ సెటైర్లు వేశారు. న్యాయం చేయాలని విద్యార్థులు అడుగుతున్నారని, వారికి అండగా నిలబడతామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై కొట్లాడితే చోటాభాయ్‌కు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చురకలు అంటించారు. మోదీ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమంటూ ప్రశ్నించారు. పాత కేసులు తోడుతారని సీఎం భయపడుతున్నారని ఎద్దేవా చేశారు.÷ుల్లీలో మోదీ ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తే రేవంత్ ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్‌పై ఆయన ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నలు సంధించారు. విద్యార్థులను కొడుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పేపర్ లీక్‌కు తనకు సంబంధం ఏంటని, యూత్ కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి ఉందా? అంటూ మండిపడ్డారు. వాళ్లు దేశంలో ఏం జరిగినా.. కేసీఆర్, కేటీఆర్‌దే తప్పు అంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి నిద్రలో కూడా కేసీఆరే గుర్తు వస్తున్నారని కేటీఆర్ చురకలు అంటించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఎన్‌టీఏ ప్రక్షాళన.. 47 మంది అధికారులపై వేటు

**న్యూఢిల్లీ,జులై 24.(జర్నలిస్ట్ వార్త)**

నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రక్షాళన దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సంస్థ విశ్వసనీయతను పునరుద్ధరించే లక్ష్యంతో ఎన్‌టీఏలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే సుమారు 47 మంది అధికారులను విధుల నుంచి తొలగించింది.రాబోయే నెల రోజుల్లో ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తికానున్నట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో భవిష్యత్తులో ఎలాంటి లీకేజీలకు, అవకతవకలకు తావులేకుండా అత్యంత పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే తొలగించిన 47 మంది అధికారులతో పాటు, మరికొందరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పరీక్షల నిర్వహణకు సంబంధించిన అవుట్‌సోర్సింగ్ విధానాన్ని కూడా పూర్తిగా మార్చాలని, అంతర్గత నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని భావిస్తోంది.ఈ ఏడాది జరిగిన నీట్-యూజీ పరీక్షలో పేపర్ లీక్ కావడం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. విద్యార్థుల ఆందోళనలు, పార్లమెంటులో విపక్షాల నిరసనలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో సుమారు 22 లక్షల మంది విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. పరీక్షల నిర్వహణ వ్యవస్థను సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ప్రస్తుతం ఈ చర్యలు చేపడుతోంది.

తాజా మార్పులు కేవలం స్వల్ప సర్దుబాట్లు కాదని, వ్యవస్థను సమూలంగా మార్చే 'ఫండమెంటల్ రీసెట్' అని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నీట్, జేఈఈ మెయిన్, సీయూఈటీ వంటి 15 నుంచి 20 కీలక జాతీయ స్థాయి పరీక్షలను ఎన్‌టీఏ నిర్వహిస్తోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే ఈ ప్రవేశ పరీక్షల పవిత్రతను కాపాడటమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశం.

## నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు


**మొదటిపేజీ తరువాయి**

కుట్ర శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఎండగట్టారు.

నీట్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల కలలు, తల్లిదండ్రుల ఆశలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ ఘటనపై ప్రధాని మోదీ తీవ్రంగా కలత చెందారని బండి సంజయ్ తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశామని, ఇప్పటికే సీబీఐ విచారణ వేగవంతం చేసి 11 మంది ఫ్యాకల్టీ సహా మొత్తం 17 మందిని అరెస్ట్ చేసిందని చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా దీనిపై క్షమాపణలు చెప్పారని గుర్తుచేశారు. విద్యార్థుల విద్యా సంవత్సరం ఏమాత్రం వృథా కాకూడదనే ఉద్దేశంతో కేవలం 40 రోజుల్లోనే మళ్లీ పరీక్షలు పూర్తి చేసి, ఫలితాలను కూడా వెల్లడించామని వివరించారు.ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో కమ్యూనిస్టు శక్తులు తీవ్ర అరాచకం సృష్టించాయని ఆయన ఆరోపించారు. ఏకంగా దేశ పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్రలు చేస్తూ, దేశ వ్యతిరేక నినాదాలతో విరుచుకుపడ్డారని మండిపడ్డారు. నిరసనల పేరుతో పోలీసులపై, మహిళా జర్నలిస్టులపై అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దాడులు చేశారని విమర్శించారు. ఈ హింసలో 118 మంది పోలీసుల తలలు పగిలి తీవ్ర గాయాలైనా, అత్యంత సంయమనం పాటిస్తూ ఫైరింగ్ చేయలేదని, శాంతిభద్రతల రక్షణ కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.ఢిల్లీలో చెలరేగిన ఈ ఉద్రిక్తతల వెనుక విదేశీ కుట్ర కోణం ఉందని బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు. పాకిస్థాన్ కేంద్రంగా సోషల్ మీడియాలో నిమిషాల వ్యవధిలో విష ప్రచారం చేస్తూ, దేశంలో అశాంతిని రేపేందుకు కుట్రలు పన్నుతున్నారని వెల్లడించారు. దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, భారత్‌లో అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తున్న పాకిస్థాన్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను తక్షణమే బ్లాక్ చేసిందని బండి సంజయ్ తెలిపారు.

## చట్టాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ సేవ సదస్సులు.

**-జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ నాగేశ్వరావు.**




**బయ్యారం/,జులై 24.(జర్నలిస్ట్ వార్త)** గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నట్లు జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ నాగేశ్వరావు అన్నారు.బయ్యారం మండలం కోయగూడెం గ్రామపంచాయతిలో సర్పంచ్ బానోత్ లింగా నాయక్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు.ఈ సందర్బంగా జడ్జి మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవ గాహన కలిగి ఉండాలని,గ్రామాలలో,విద్యా సంస్థల్లో న్యాయ సేవ సహకార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తూన్నామన్నారు.కోయగూడెం గ్రామపంచాయతీలో అంతకుముందు ఉన్న సర్పంచులు ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించలేదని,లింగా నాయక్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని సర్పంచ్ లింగా నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకెట్ వై చెన్నమల్లారెడ్డి, గవర్నమెంట్ ఏజిపి సునీత,అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ రాజు కృష్ణ,అడ్వైకెట్ సురేష్,జిల్లా న్యాయ సేవ సహకార సంస్థ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

**మొదటిపేజీ తరువాయి**

దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ప్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ప్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు పక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే పక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి విస్తరణకు ప్రభుత్వం నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి**

సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ మినరల్స్, బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగితే, క్రమంగా థర్మల్ విద్యుత్ మరియు బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని చెప్పారు. కొత్తగూడెంలోని సింగరేణికి కార్యాలయంలో సింగరేణి, జెన్ కో ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు సింగరేణి ఆత్మ వంటిది. 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని ఆయన అన్నారు. గతంలో ఉత్పత్తి రంగంలో సింగరేణిది ఏకఛత్రాధిపత్యం ఉండేదన్నారు. ఏ ధర నిర్ణయిస్తే, ఆ ధరకే వినియోగదారులు బొగ్గును కొనుగోలు చేసేవారని ఆ న్నారు. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెప్పారు. ప్రైవేటీకరణ విపరీతంగా పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని తీసుకురావడంతో అనేక ప్రైవేట్ సంస్థలు రంగంలోకి వచ్చాయని చెప్పారు. దీనితో ప్రభుత్వరంవ సంస్థలు ప్రైవేట్ వారితో పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేట్ సంస్థలతో నాణ్యత, నిర్వహణా వ్యయాన్ని తగ్గించుకోవడం, ఉత్తమ సేవల్లో పోటీపడి సింగరేణి స్థానాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదని అన్నారు. తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా కఠినంగా పర్యవేక్షించాలని అధికారులకు ఆయన సూచనలు చేశారు. బొగ్గు శుద్ధీకరణకు సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. వేర్వేరు గ్రేడ్ల బొగ్గును సరైన నిష్పత్తిలో ÷-లబెండింగ్ చేసి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందుచూపు, సుదీర్ఘ ప్రణాళికలు లేకపోవడం వల్ల సింగరేణి.. వేలంలో పాల్గొని నూతన బొగ్గు బ్లాకులను పొందకలేక పోయిందని అన్నారు. భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ పవర్ ఎ÷-లాంట్ల నిర్మాణంలో సరైన ప్రణాళికలు రూపొందించలేదని అన్నారు. వాటికి అవసరమయ్యే బొగ్గు బ్లాకులను కేటాయించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఒడిశాలోని నైనీ బ్లాక్, తాడిచర్ల-2 ప్రాజెక్టులపై ఉన్న భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వేగవంతం చేసి పరిష్కరించిందని అన్నారు. సింగరేణి అనేది కేవలం ఒక వ్యాపార సంస్థ మాత్రమే కాదు, వేలాది మంది కార్మిక కుటుంబాల జీవితమని అన్నారు. సంస్థ లాభాల్లో ఉంటేనే కార్మికుల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని అన్నారు. ప్రతి గని, మైన్ స్థాయిలో మేనేజ్‌మెంట్, కార్మిక సంఘాలు ప్రతి కార్మికుడితో ఓపెన్ చర్చలు ప్రారంభించాలని ఆన్నారు. సంస్థ మనుగడకు తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి అందరినీ భాగస్వాములను చేస్తూ ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. రాబోయే 15 - 20 ఏళ్లలో ఇంధన రంగం విపరీతంగా మారబోతోందన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ ఆధారిత బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగే అవకాశం ఉండన్నారు. ఇవి పెరిగితే థర్మల్ విద్యుత్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని అధికారులకు సూచనలు చేశారు. సెమికండక్టర్స్, చిప్స్, ఈవీ బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల మైనింగ్ రంగానికి సింగరేణి విస్తరించాలన్నారు. ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా వంటి దేశాల్లో క్రూషియల్ మినరల్స్ వేలంలో సింగరేణి పాల్గొనాలని చెప్పారు. సింగరేణి వద్ద దశాబ్దాల అనుభవం కలిగిన నిపుణులైన ఇంజనీర్లు, మైనింగ్ కార్మికులు ఉన్నారని అన్నారు. ఈ అపారమైన మానవ వనరులను అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులకు ఉపయోగించాలన్నారు. ఇకపై బోర్డు సమావేశాలు కేవలం రొటీన్ పరిపాలనా అంశాలకే పరిమితం కాకుండా, సంస్థ విస్తరణ, రాబోయే 10 ఏళ్ల రోడ్‌మాప్‌పై సుదీర్ఘంగా చర్చించాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి సూచనలు చేశారు. కార్పొరేట్ సంస్థల మాదిరిగా టైమ్ లైన్ క్యాలెండర్ పెట్టుకుని లక్ష్యాలను పూర్తి చేయాలని బట్టి విక్రమార్క అధికారులకు దిశా నిర్దేశంచేశారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సుముఖంగా లేని కేంద్రం

**జులై 24.(జర్నలిస్ట్ వార్త)**

నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనలు ఉధృతం చేసినప్పటికీ, ఆయన రాజీనామాకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదని తెలుస్తోంది. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

“రాజీనామా చేయడం చాలా తేలికైన నిర్ణయం. కానీ ప్రజలు మాకు అధికారం ఇచ్చింది బాధ్యతలను నిర్వర్తించడానికే తప్ప, పారిపోవడానికి కాదు. మేము వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం“ అని ఉన్నత స్థాయి ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో నెలకొన్న వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించడం, పేపర్ లీక్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవడంపైనే ప్రస్తుతం ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.శుక్రవారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న సీజేపీ విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వం రెండో విడత చర్చలు జరిపింది. ప్రభుత్వ ప్రతినిధులుగా కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడం, శాంతియుత నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం వంటి అంశాలకు సూత్రప్రాయంగా అంగీకరించిన ప్రభుత్వం, మంత్రి రాజీనామా విషయంలో మాత్రం శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరినట్లు కాక్రోచ్ జనతా పార్టీ తెలిపింది. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు విరమించే ప్రసక్తే లేదని సీజేపీ నేతలు అశుతోష్ రాంకా, అభిజీత్ దీప్కే తేల్చి చెప్పారు.

ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషిని బదిలీ చేసి, కీలక విభాగాల్లో కొత్త అధికారులను నియమించింది. మరోవైపు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇతర విద్యా సంబంధిత అంశాలపై సోషల్ మీడియాలో చురుకుగా వ్యవహరిస్తూనే, పేపర్ లీక్‌లకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను షేర్ చేస్తున్నారు.

## 10 ఏళ్ల జైలు, 10 కోట్ల జరిమానా..

**మొదటిపేజీ తరువాయి**

రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తున్నారు. వ్యవస్థీకృత నేరాలకు ఇప్పటికే కఠిన శిక్షలు ఉన్నప్పటికీ, తాజా సవరణలతో వాటిని మరింత పటిష్ఠం చేయనున్నారు.దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు హాజరైన నీట్-యూజీ 2026 పరీక్ష పత్రం లీక్ కావడంతో, ఆ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించిన సంగతి విదితమే. ఈ పరిణామంతో పాటు పలు ఇతర పోటీ పరీక్షల్లోనూ అక్రమాలు చోటుచేసుకోవడంతో విద్యార్థి లోకం నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు

పలు కీలక సూచనలు చేశారు. విద్యా సంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఆయా సంస్థల యాజమాన్యాలను బాధ్యులను చేయాలని స్పష్టం చేశారు. క్యాంపస్ లోపల డ్రగ్స్‌కు సంబంధించి ఏ ఘటనకైనా యాజమాన్యాన్నే బాధ్యులను చేయాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో క్యాంపస్ బయట జరిగే యాక్టివిటీని గుర్తించి సమాచారాన్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ÷ుద్యాసంస్థలకు అధికారంతో పాటు బాధ్యతను అప్పగించాలని తెలంగాణ సీఎం పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకునేలా చూడాలని అన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందించేందుకు విద్యాసంస్థల ఆవరణలో టోల్ ఫ్రీ నెంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. గుర్తించడం, మాన్పించడం, శిక్షించడం.. ఈ మూడు దశలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం తెలిపారు. డ్రగ్స్ స్వీకరించి పట్టుబడితే డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించాలని అన్నారు. తరచూ పట్టుబడితే కఠినంగా శిక్షించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అవసరమైతే చట్టాన్ని రూపొందించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులకు తెలంగాణ సీఎం రేవంత్ స్పష్టం చేశారు.


# కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్రానికి లేఖ

**అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, జులై 24.(జర్నలిస్ట్ వార్త)**కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదిక పంపాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ సూచించిన విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు బ్యారేజీలను నీటి నిల్వ లేకుండా విధానంలో నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ పాటు పలువురు సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. భవిష్యత్తులో నీటి నిల్వ, పంపింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలా వద్దా అన్న అంశంపై కేవలం రాజకీయ ఒత్తిళ్లు లేదా పైకి కనిపించే పరిస్థితుల ఆధారంగా కాకుండా, అర్హత కలిగిన సాంకేతిక సంస్థల లిఖితపూర్వక సిఫారసుల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటామని మంత్రి తేల్చిచెప్పారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖకు పంపే లేఖలో ఎన్‌డీఎస్ఏ నివేదికలోని కీలక సిఫారసులు, గత సాంకేతిక పరిశీలనల వివరాలు, కేంద్ర జల సంఘం నివేదికలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల ఫలితాలు, రాఫ్ట్ ఫౌండేషన్ కింద గుర్తించిన ఖాళీల వివరాలు, ఫోటోలు, ఇతర ఇంజినీరింగ్ ఆధారాలు అన్నింటినీ జతచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బ్యారేజీలను ఎందుకు నీటి నిల్వకు, పంపింగ్‌కు వినియోగించడం లేదన్న విషయాన్ని పూర్తి సాంకేతిక ఆధారాలతో కేంద్రానికి వివరించి, సమర్థ సాంకేతిక సంస్థల నుంచి అధికారిక అభిప్రాయం కోరాలి. ప్రభుత్వ నిర్ణయం మొత్తం అధికారిక రికార్డులో ఉండాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులకు వెంటనే అందేలా రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ద్వారా లేఖను స్వయంగా అందజేయాలని కూడా మంత్రి ఆదేశించారు. సమీక్ష సందర్భంగా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఇటీవల కేంద్ర జల్ శక్తి మంత్రి చేసిన ప్రకటనలు, మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన లేఖలు సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలే బ్యారేజీల నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నప్పటికీ, ఎన్‌డీఎస్ఏ నివేదికలో స్పష్టంగా సూచించిన 'ఫ్రీ-ఫ్లో విధానంలో కొనసాగించాలి' అనే అంశంపై ప్రత్యేకంగా ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని వివరించారు. మంత్రి మాట్లాడుతూ, కాళేశ్వరం బ్యారేజీలపై జరుగుతున్న ప్రతి శాస్త్రీయ పరిశీలన, ప్రతి సాంకేతిక పరీక్ష కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీఎస్ఏ సూచనల ప్రకారమే నిర్వహిస్తున్నామని తెలిపారు

## భీమదేవరపల్లిలో విద్యాసంస్థల బంద్ విజయవంతం..

### కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు డిమాండ్






**భీమదేవరపల్లి/జూలై 24 (జర్నలిస్ట్ వార్త):**నీట్ (ఎన్ఇఇటి) పేపర్ లీక్ ఘటనతో పాటు ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ పిలుపు మేరకు భీమదేవరపల్లి మండలంలోని పాఠశాలలు, కళాశాలల బంద్‌ను ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు విజయవంతం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశ రాజధానిలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ ఘటన దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైందని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విద్యార్థుల హక్కుల కోసం చేస్తున్న పోరాటానికి మద్దతు తెలుపుతూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసే వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు ఆదరి మహేందర్ యాదవ్, యువజన కాంగ్రెస్ నాయకులు చిట్కూరి అనిల్, గుడిగందుల రాజు, ఆదరి రాజేందర్ యాదవ్, గిరబోయిన అఖిల్ యాదవ్, చిట్కూరి నితిన్, తాళ్ల అరవింద్ గౌడ్, మర్రి దేవరాజు, వేణు, నిఖిల్, తాళ్లపల్లి ప్రవీణ్, తాళ్ల అరవింద్, చిట్టంపల్లి స్వామి, లడ్డ, కూకట్ల కౌశిక్ యాదవ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గంజాయి రహిత సమాజమే లక్ష్యం

### ఉప్పరపల్లిలో పోలీస్ కళాబృందం చైతన్య సదస్సు





**వర్ధన్నపేట/జులై 24(జర్నలిస్ట్ వార్త);**
యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని వర్ధన్నపేట ఎస్ఐ సాయిబాబు పిలుపునిచ్చారు. వరంగల్ సీపీ. శ్వేత ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో '/జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయిబాబు మాట్లాడుతూ కళాబృందం సభ్యులు పాటలు, నాటికల ద్వారా ప్రదర్శించిన సామాజిక అంశాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. గ్రామంలో గంజాయి అమ్మినా, సేవించినా వెంటనే 8712584473 నంబరుకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గుప్తంగా ఉంచుతామని స్పష్టం చేశారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ మోసపోతే తక్షణమే 1930 హెల్ప్‌లైన్ నంబరును సంప్రదించాలని తెలిపారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు అత్యంత కీలకమని పేర్కొన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థలను అరికట్టాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని చెప్పారు. వయోధికులైన తల్లిదండ్రులను ప్రేమతో, బాధ్యతగా చూసుకోవడం ప్రతి ఒక్కరి కనీస ధర్మమని గుర్తుచేశారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 సేవలను ఉపయోగించుకోవాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రాజేష్, సోమ్లా, కళాబృందం ఇన్‌ఛార్జ్ డబ్ల్యూఏఎస్ఐ నాగమణి, హెచ్‌సీలు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, హోంగార్డులు, సుమారు 300 మంది గ్రామస్థులు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా

### దేవునూరులో కేక్ కట్ చేసి పండ్ల పంపిణీ



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోజూలై 24 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను శుక్రవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుడి వెనుక దేవేందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి గ్రామస్తులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి కేటీఆర్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఆయనకు కలగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు యాదగిరి, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పార్టీ ముఖ్య కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

## త్రాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ట కార్యాచరణ

### గ్రామాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి -అధికారులకు కలెక్టర్ దివాకర్ టీఎస్ ఆదేశాలు





**ఖమ్మం,/ జూలై 24 (జర్నలిస్ట్ వార్త):** ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎక్కడా త్రాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి త్రాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ పంటలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల వారీగా త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. మిషన్ భగీరథపై ఆధారపడే గ్రామాలతో పాటు స్థానిక నీటి వనరుల లభ్యతపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని చెప్పారు. వినియోగంలోకి తీసుకురాగల వనరులు, పునరుద్ధరించాల్సిన వనరులను గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఎల్నినో పరిస్థితులపై అవగాహన కల్పించాలని సూచించారు. త్రాగునీరు, సాగునీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, వర్షాభావ పరిస్థితుల్లో త్రాగునీటికే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. నీటి వృథా, అక్రమ వినియోగం జరగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, వివో భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని, గ్రామాల్లో ఫామ్ పాండ్లను గుర్తించి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణాలు పూర్తిచేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఎస్ఈ శేఖర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## నీట్ లీకేజీపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు: గిద్దె రాజేష్

**కోదాడ/, జూలై 24 (జర్నలిస్ట్ వార్త):**




నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆయనను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోదాడలో బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని అన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. విద్యార్థులపై అక్రమ కేసులు నమోదు చేయడం, శాంతియుత ఆందోళనలపై లాఠీచార్జీలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. పేపర్ లీకేజీలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, పరీక్షల వ్యవస్థను దేశవ్యాప్తంగా ప్రక్షాళన చేసి జాతీయ స్థాయి పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీట్ వ్యవహారంలో తీవ్ర మనోవేదనకు గురైన విద్యార్థులకు న్యాయం చేయాలని, ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కోదాడలో విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్‌కు రాజకీయ, విద్యార్థి, ప్రజా, ఉద్యమ సంఘాలన్నీ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని గిద్దె రాజేష్ పిలుపునిచ్చారు.

## సీఈఐఆర్‌తో పోగొట్టుకున్న మొబైళ్ల జాడ

### రికవరీ చేసి బాధితులకు అప్పగించిన హసన్‌పర్తి పోలీసులు





**హసన్‌పర్తి, /జూలై 24 (జర్నలిస్ట్ వార్త):** పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించడంలో హసన్‌పర్తి పోలీసులు మరోసారి సఫలమయ్యారు. ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను శుక్రవారం బాధితులకు అందజేశారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఆయా ఫోన్ల ఐఎంఈఐ నంబర్లను కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి బ్లాక్ చేశారు. అనంతరం సాంకేతిక నిఘా ద్వారా ఫోన్ల ఆచూకీని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను అసలు యజమానులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ చేతుల మీదుగా అందజేశారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే రికవరీకి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పోలీసులు తెలిపారు. బాధితులు తమ మొబైల్ ఫోన్లను తిరిగి అప్పగించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావంతో రైతులు పంటల వైవిధ్యీకరణకు ముందుకు రావాలి.





### -వ్యవసాయ అధికారి కే. రాజు.

**బయ్యారం/,జులై 24.(జర్నలిస్ట్ వార్త)**
ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం కారణంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ, తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి కే.రాజు రైతులకు సూచించారు. ఈ మేరకు కాచనపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం సాగునీటి శాఖ సమన్వయంతో రైతుల అవగాహన సమావేశం సర్పంచ్ యాలం రేవతి అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ, ప్రస్తుతం మండలంలోని చెరువులు, కుంటలు, బోరు బావుల్లో నీటి లభ్యత ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, రైతులు అధిక నీటి అవసరమయ్యే వరి సాగును సాధ్యమైనంత వరకు తగ్గించి, పెసర, మినుములు, ఇతర పప్పుధాన్యాలు, కూరగాయలు వంటి పంటల వైవిధ్యీకరణ ద్వారా వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు గ్రామంలోని కూరగాయలు మరియు పెసర పంట పొలాలను సందర్శించి, పంటల స్థితిగతులను పరిశీలించి రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి పంటల యాజమాన్యంపై సాంకేతిక సూచనలు అందించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీపై పెసర విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రస్తుతం బయ్యారం మండలానికి 7 క్వింటాళ్ల పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి విత్తనాలను పొందాలని సూచించారు. అదేవిధంగా, వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టుకొని భూగర్భ జలమట్టాన్ని పెంచేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వి.బి.జి. రామ్ పథకం కింద వ్యవసాయ పొలాల్లో ఫామ్ పండ్ల నిర్మాణానికి అవకాశం కల్పించిందని వివరించారు. జాబ్ కార్డు కలిగిన చిన్న మరియు సన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులని, ఆసక్తి గల రైతులు శ్రీ సజన్ స్వరూప్, ప్రోగ్రామ్ అధికారిని సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్,వార్డు సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నిందితుల తలకు ప్లాస్టిక్ కవర్లు.. విమర్శల వెల్లువ

### అటవీశాఖ తీరుపై ప్రజల్లో అసంతృప్తి

### తల్లాడ రేంజ్ అధికారుల పనితీరుపై ఆరోపణలు




**తల్లాడ, /జూలై 24 (జర్నలిస్ వార్త):** ఎలుగుబంటి వేట కేసులో అరెస్టు చేసిన నిందితుల తలకు ప్లాస్టిక్ కవర్లు కట్టి మీడియా ముందు ప్రవేశపెట్టడం తల్లాడ అటవీశాఖ అధికారుల తీరుపై విమర్శలకు తావిస్తోంది. ప్లాస్టిక్ నిర్మూలన, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన శాఖే ప్లాస్టిక్‌ను వినియోగించడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణకు భారీగా నిధులు వెచ్చిస్తోంది. అయితే వాటిని అమలు చేయాల్సిన అధికారులే విరుద్ధంగా వ్యవహరించడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో చెక్‌పోస్టుల నిర్వహణ, అక్రమాల నియంత్రణ, విధి నిర్వహణలో నిర్లక్ష్యం చోటుచేసుకుంటోందంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేరుకే చెక్‌పోస్టులు నిర్వహిస్తూ అక్రమాలను అరికట్టడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అటవీ ప్రాంతాల్లో జరిగే కొన్ని ఘటనలను గోప్యంగా ఉంచుతూ మీడియాకు కూడా సమాచారం ఇవ్వడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తల్లాడ ఫారెస్ట్ రేంజ్ అధికారుల పనితీరుపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# నీట్ లీకేజీపై ఎస్ఎఫ్ఐ ఆందోళన

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి.. ఎన్‌టీఏ రద్దు చేయాలి -హనుమకొండలో విద్యాసంస్థల బంద్, భారీ ర్యాలీ**





**హసన్‌పర్తి, /జూలై 24 (జర్నలిస్ట్ వార్త):** నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ నగరంలోని విద్యాసంస్థల బంద్ విజయవంతం చేశారు. అనంతరం సుబేదారి లా కళాశాల నుంచి అదాలత్ జంక్షన్ వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి, జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందన్నారు. పేపర్ లీకేజీలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు శాంతియుతంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు.ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టిన విద్యార్థులపై టియర్ గ్యాస్ ప్రయోగించడం, లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. నీట్ లీకేజీ వ్యవహారంపై ధర్మేంద్ర ప్రధాన్ మంత్రి పదవికి రాజీనామా చేయాలని, ఎన్‌టీఏను రద్దు చేసి పారదర్శక పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నష్టపోయిన నీట్ విద్యార్థులు, వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే న్యాయం చేసి తగిన సహాయం అందించాలని కోరారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బి.రెడ్డి జశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరి సాయికుమార్, పవన్ కుమార్, సాల్మన్ రాజ్, అభిషేక్, అనూఫ్, రాహుల్, మంద పవన్ కళ్యాణ్, శిరీష, ప్రవళిక, దివ్య, అనూష, సందీప్, రాజ్‌కుమార్, ఉదయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ నిర్మాణాలకు అడ్డంకులు సృష్టిస్తే చర్యలు

**రోడ్లపై అక్రమ కట్టడాలు తొలగించాలని అధికారుల హెచ్చరిక**



**ఎల్కతుర్తి, /జూలై 24 (జర్నలిస్ట్ వార్త):ం** డ్రైనేజీ నిర్మాణ పనులకు అడ్డంకులు కల్పిస్తూ రోడ్లపై ఎలాంటి గోడలు, అక్రమ కట్టడాలు నిర్మించరాదని అధికారులు హెచ్చరించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ సమీపంలో కొందరు రహదారి పరిధిలో నిర్మాణాలు చేపట్టిన నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, స్థానిక పోలీసు సిబ్బంది గురువారం సంబంధిత వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు సహకరించాలని, జాతీయ రహదారి నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. ప్రభుత్వ పనులను అడ్డుకోవడం లేదా రహదారి ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎస్సై శంకర్, కానిస్టేబుళ్లు బక్కయ్య, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎలుగుబంటి వేట కేసులో ముగ్గురు అరెస్ట్

**ఇద్దరు పరారీలో.. వైర్ ఉచ్చులు స్వాధీనం**

**వన్యప్రాణుల వేటగాళ్లపై కఠిన చర్యలు తప్పవు: రేంజర్ ఉమా**

**తల్లాడ,/ జూలై 24 (జర్నలిస్ వార్త):** ఖమ్మం జిల్లా తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని లోకవరం అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి మృతి ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఫారెస్ట్ రేంజర్ జి. ఉమా తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందన్నారు.శుక్రవారం తల్లాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 23న అందిన విశ్వసనీయ సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు లోకవరం అడవుల్లో తనిఖీలు నిర్వహించగా ఎలుగుబంటి మృతదేహం గుర్తించామని చెప్పారు. ఘటనాస్థలిలో సుమారు 2.20 కిలోల బైండింగ్ వైర్ కాయిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎలుగుబంటికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం విచారణలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.
నిందితులపై వన్యప్రాణుల సంరక్షణ చట్టం1972 కింద కేసు నమోదు చేసి సత్తుపల్లి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వన్యప్రాణుల వేట, విద్యుత్ తీగలు, విషప్రయోగం, ఉచ్చులు ఏర్పాటు చేయడం వంటి అక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.సమావేశంలో డీఆర్‌వోలు బాలాజీ, ఎఫ్ఎస్‌వోలు సురేష్‌కుమార్, కిశోర్‌కుమార్, ఎఫ్‌బీవోలు ఎం.డి. అజమ్ అలీ, బీబీమా, శ్రీకాంత్, సిద్ధారావు, ఎన్. రమేశ్, ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్, కృష్ణ, నరసింహారావుతో పాటు అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

## జగ్గుతండా జిపిలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహణ.

**-సర్పంచ్ బొల్లి జయంతి వెంకట కృష్ణ.**




**బయ్యారం/,జులై 24.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం జగ్గుతండా గ్రామపంచాయతీలో సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ, ఉప సర్పంచ్ గుంజ వీరస్వామి ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని 9వ,6వ వార్డులో పారిశుద్ధ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సైడ్ డ్రైనేజీ క్లీనింగ్,నీళ్లు ఆగిన చోట దోమలను నివారించడానికి థీమా పాస్ ద్రవాన్ని చల్లడంతో పాటు ప్రతి ఒక్కరి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ప్లాస్టిక్ నివారించాలని,తడి చెత్తను,పొడి చెత్తను వేరు చేయాలని గ్రామస్తులకు సూచించారు.దాంతోపాటు గ్రామపంచాయతీలో పచ్చదనాన్ని ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో చెట్లను నాటారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గుగులోత్ కవిత, సెక్రటరీ శ్రీహరి, ఏఎన్ఎం లత,సమ్మక్క,అంగన్వాడీ టీచర్ ముకుంద,గ్రామ వివో పుల్లబాయ్,ఉమా,ఆశా కార్యకర్తలు,గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజలకు తొలి ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు.

**-ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి.**



**బయ్యారం/,జులై 24.(జర్నలిస్ట్ వార్త)** తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బయ్యారం మండల ప్రజలకు జగ్గుతండా ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి శుభాకాంక్షలు తెలిపారు. తొలి పండుగగా భావించే ఈ తొలి ఏకాదశి సందర్భంగా విష్ణుమూర్తి అనుగ్రహంతో అందరికీ మంచి జరగాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు.వర్షాలు సమృద్ధిగా కురిసి,పాడి పంటలతో మండలం సుభిక్షంగా ఉండాలని ఆయన ప్రార్థించానన్నారు.తొలి ఏకాదశి వ్యవసాయ ప్రాధాన్యత కలిగిన పండుగ కావడం,వర్షాకాలం ప్రారంభానికి సూచికగా భావించబడటం వల్ల, రైతన్నలకు మేలు జరగాలని, పంటలు బాగా పండాలని వీరస్వామి ఆకాంక్షించారు.

## బయ్యారం విద్యుత్ శాఖ ఏఈ రఫీవుద్దీన్ కు సన్మానం.



**బయ్యారం/,జులై 24.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండల విద్యుత్ శాఖ ఏఈ గా పదోన్నతి పై వచ్చిన మహమ్మద్ రఫీవుద్దీన్ ను బయ్యారం మండల ముస్లిం సోదరులు జామియా మస్జీద్ నందు శుక్రవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ మండలంలో ఏటువంటి విద్యుత్ సమస్య ఉన్న సత్వరమే పరిష్కార దిశగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బయ్యారం మండల లైన్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ సలీం, మహమ్మద్ షరీఫ్,షేక్ జిలాని,షేక్ సలీం,షేక్ రఫీ,భాష,సయ్యద్ జహంగీర్,అబ్దుల్,మున్వర్,ముస్తఫా నగర్ యూత్,విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## కేటీఆర్ జన్మదిన వేడుకలు



**వర్ధన్నపేట/ జులై24 (జర్నలిస్ట్ వార్త):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను వర్ధన్నపేట మండలంలోని నల్లబెల్లి గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటికాయల సురేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఉపసర్పంచ్ మేకల దేవేందర్, నాయకులు బిర్రు చంద్రయ్య, తక్కలపల్లి వెంకటేశ్వరరావు, కొండపల్లి శ్రీనివాస్, బిర్రు రాజు, బాతు వెంకన్న, బిర్రు రవీందర్, మేకల రాములు, తంగెళ్ల భాస్కర్, గుంటి రవి, చాగంటి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు ప్రత్యేక పిచికారీ

**గ్రామ ప్రజలు పరిశుభ్రత పాటించాలని సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా సూచన**



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోజూలై 24 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా ఆదేశాల మేరకు శుక్రవారం దోమల నివారణ కోసం ప్రత్యేకంగా మందు పిచికారీ చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, మురుగు కాలువలు, దోమలు అధికంగా వ్యాపించే ప్రాంతాల్లో సిబ్బంది మందు పిచికారీ నిర్వహించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, చెత్తాచెదారం పేరుకుపోకుండా పరిశుభ్రత పాటించాలని కోరారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. గ్రామంలో ఎక్కడైనా దోమల సమస్య అధికంగా ఉంటే వెంటనే గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## గిఫ్ట్ ఏ స్మైల్‌తో కేటీఆర్ జన్మదిన వేడుకలు


**మానసిక వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం, పండ్ల పంపిణీ**





**హసన్‌పర్తి/జూలై 24 (జర్నలిస్ట్ వార్త):** భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని హసన్‌పర్తి మండలంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ బండి రజని కుమార్ ఆధ్వర్యంలో అతిథి మానసిక వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం, పండ్ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ బండి రజని కుమార్ మాట్లాడుతూ, కేటీఆర్ ఇచ్చిన "గిఫ్ట్ ఏ స్మైల్" పిలుపు మేరకు కేకులు కట్ చేయడం, ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేయడం కంటే అవసరమైన వారికి సాయం చేయాలని భావించి ఆశ్రమంలోని మానసిక వికలాంగులకు ఒకపూట భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్, మాజీ జెడ్పీటీసీ కొత్తకొండ సుభాష్ గౌడ్, 65వ డివిజన్ నాయకుడు నద్దునూరి నాగరాజు, పాడి మల్లారెడ్డి, సూరం వాసుదేవ్ రెడ్డి, పోలేపల్లి మైకేల్ రాజు, మొట్టే అరుణ్, చాతాల వేణుగోపాల్, రాజు నాయక్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్పంచ్‌కే కుల వివక్ష వేధింపులు!

**పెరుమాండ్లగూడెంలో ఘర్షణ.. ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు**


Scanned with OKEN Scanner


FIRST INFORMATION REPORT

7. Details of known/suspected/unknown accused with full particulars:
Serial No : 1
a) Name Pidugu Srikanth
b) Father's /Husband's Name Sampath
c) Occupation Yadava/Golla Male
f) Age Nationality India
g) Address
House No Perumandlagudem village Area/Mandal INAVOLU
City/District WARANGAL State TELANGANA
Serial No : 2
a) Name Pidugu Rakesh
b) Father's /Husband's Name Sampath
d) Caste Yadava/Golla e) Gender Male
f) Age Nationality India
g) Address
House No Perumandlagudem Area/Mandal INAVOLU

**ఐనవోలు/ జులై 24 (జర్నలిస్ట్ వార్త):** గ్రామంలో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించేందుకు యత్నించిన గ్రామ ప్రథమ పౌరుడికే కుల వివక్ష ఎదురైంది. పంచాయతీ చేస్తుండగా సర్పంచ్‌పైనే దూషణలకు దిగి దాడికి యత్నించిన సంఘటన ఐనవోలు మండలం పెరుమాండ్లగూడెంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం. పెరుమాండ్లగూడెంలో ఇటీవల రెండు వర్గాల మధ్య తీవ్ర గొడవ జరిగింది. గ్రామంలో శాంతిభద్రతల దృష్ట్యా ఈ వివాదాన్ని సర్దుబాటు చేయాలని భావించిన స్థానికులు గ్రామ సర్పంచ్ రాకేష్‌ను ఆశ్రయించారు. సర్పంచ్ ఇరువర్గాలను పిలిపించి మాట్లాడే ప్రయత్నం చేస్తుండగా నచ్చజెప్పడం గిట్టని పిడుగు శ్రీకాంత్, రాకేష్ అనే ఇద్దరు వ్యక్తులు ఆవేశంతో ఊగిపోయారు. ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా సర్పంచ్ రాకేష్‌ను అందరి ముందే కులం పేరుతో నీచంగా దూషిస్తూ బూతులతో విరుచుకుపడ్డారు.ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన సర్పంచ్ రాకేష్ వెంటనే ఐనవోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి పిటిషన్‌పై స్పందించిన పోలీసులు ప్రాథమిక విచారణ అనంతరం నిందితులు పిడుగు శ్రీకాంత్, రాకేష్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి

**వర్ధన్నపేట/జులై 24(జర్నలిస్ట్ వార్త):** ఇల్లంద గ్రామంలో రేషన్ కార్డుదారులు ఈ నెల 31వ తేదీలోగా ఈ–కేవైసీ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య సూచించారు. గ్రామ పరిధిలో ఇప్పటివరకు ఈ–కేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులు వెంటనే తమ సంబంధిత రేషన్ దుకాణానికి వెళ్లి బయోమెట్రిక్ ధృవీకరణ చేయించుకోవాలని గ్రామ అధికారులు, రేషన్ డీలర్లు కోరారు.
చివరి తేదీ వరకు వేచి చూడకుండా అవసరమైన గుర్తింపు పత్రాలతో లబ్ధిదారులు వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి జీవనాడి

**అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయాలి: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**




**దామచర్ల,/ జూలై 24 (జర్నలిస్ట్ వార్త):** ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. దామచర్ల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం సర్పంచ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతి గ్రామంలో 100 శాతం ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేసేలా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయడంతో పాటు, ఓటరు జాబితాలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా బలమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి తోడ్పడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# కార్యాలయం వర్ధన్నపేటలోనే.. కానీ అధికారులు ఎక్కడ?

**సాగునీటి తిప్పల్లో రైతన్నలు.. పట్టించుకోని ఇరిగేషన్ యంత్రాంగం**

**అందుబాటులో ఉండని తీరుపై సర్వత్రా విమర్శలు**




**వర్ధన్నపేట, జులై 24 (జర్నలిస్ట్ వార్త):** వానకాలం సాగు పనులు వేగవంతమయ్యాయి. పొలాలకు నీళ్లందించేందుకు చెరువులు, కాలువల వద్ద రైతులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. ఇలాంటి అత్యంత కీలకమైన సమయంలో రైతులకు మార్గదర్శనం చేస్తూ, సాగునీటి సరఫరాను పర్యవేక్షించాల్సిన ఇరిగేషన్ శాఖ అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదు. వర్ధన్నపేటలో కార్యాలయం బోర్డు మాత్రమే దర్శనమిస్తుండగా, అధికారులు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో, ఎప్పుడు వస్తారో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది.

**తలుపులు తీయని ఆఫీసు.. పెరిగిన తిప్పలు**

మండల పరిధిలోని పలు చెరువులు, కాలువల కింద వేలాది ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. నీటి విడుదల, తూముల నిర్వహణ, కాలువల పూడికతీత లేదా మరువలు పాడవడం వంటి సమస్యలపై అధికారులకు విన్నవించుకుందామని కార్యాలయానికి వస్తున్న రైతులకు తాళం వేసిన తలుపులే స్వాగతం పలుకుతున్నాయి. ఫోన్లు చేసినా సరిగ్గా స్పందించకపోవడంతో ఏ సమస్య వచ్చినా ఎవరికి చెప్పుకోవాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు.

**జవాబుదారీతనం ఏది?**

ప్రభుత్వం ప్రతి ఎకరానికీ సాగునీరు అందించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, క్షేత్రస్థాయిలో బాధ్యత వహించాల్సిన అధికారులు మాత్రం కార్యాలయానికి రాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పంటల సాగు సమయం ముగిసాక అధికారులు అందుబాటులోకి వస్తే రైతులకు జరిగే నష్టాన్ని ఎవరు పూడుస్తారు? సాగునీటి శాఖ యంత్రాంగం ఇకనైనా క్షేత్రస్థాయి సమస్యలపై దృష్టి సారిస్తుందా? ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వర్ధన్నపేట ఇరిగేషన్ అధికారుల పనితీరుపై సమీక్షించాలని, నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది.

# కక్షసాధింపు కూల్చివేతలు!

**ఇల్లందలో ముందస్తు నోటీసులు లేకుండా ప్రహరీ, మెట్లు నేలమట్టం**

**బీఆర్ఎస్ నాయకత్వంపై వార్డు ప్రజల ఆగ్రహం.. బాధితులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హామీ**





**వర్ధన్నపేట, జులై 24 (జర్నలిస్ట్ వార్త):** రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తమ ఇళ్లను టార్గెట్ చేస్తూ ముందస్తు నోటీసులు లేకుండా ప్రహరీ గోడలు, మెట్లను కూల్చివేశారని వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని 12వ వార్డు నివాసితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.ఇల్లందలో 30 ఏళ్లుగా నివసిస్తున్న సుంకరి బాబు, సంతోష్, రాజు ఇళ్ల ముందు భాగాలను గ్రామ సర్పంచ్ బేతి సాంబయ్య, ఉపసర్పంచ్ భర్త, పంచాయతీ కార్యదర్శి శంకర్ రావులు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా గురువారం కూల్చివేశారు. ఎన్నికల్లో తమకు సహకరించలేదనే కక్షతోనే అధికార దుర్వినియోగానికి పాల్పడి ఇళ్లను కూల్చారని గ్రామంలో చర్చ సాగుతోంది. మెట్లు కూల్చేయడంతో నడవలేక ఒక చిన్నారి కిందపడి గాయపడిందని బాధితురాలు సుంకరి స్రవంతి కన్నీటిపర్యంతమయ్యారు.అధికారుల ఏకపక్ష వైఖరిపై బాధితులు, స్థానికులు ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకుండా కూల్చివేతలు చేపట్టడంపై ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కార్యదర్శిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఎంపీఓను ఆదేశించారు. ఇదే విషయమై ప్రశ్నించిన విలేకరులపై పంచాయతీ కార్యదర్శి దురుసుగా ప్రవర్తించడం గమనార్హం.

కూల్చివేతల సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, వార్డు సభ్యుడు బాషబోయిన ప్రవీణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులకు మద్దతుగా నిలిచారు. ఈ విషయాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఫోన్ ద్వారా బాధితులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని, బాధితులకు ఖచ్చితంగా న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు

**నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం వైఖరిని ఎండగట్టిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**వర్ధన్నపేటలో కాంగ్రెస్ ధర్నా.. మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మల దహనం**





**వర్ధన్నపేట/జులై 24 (జర్నలిస్ట్ వార్త):** నీట్ పేపర్ లీకేజీపై న్యాయం అడిగిన విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం, వారికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మండిపడ్డారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వర్ధన్నపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసేలా నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తాను పోలీస్ సర్వీస్‌లో ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యమ సమయంలోనూ విద్యార్థులపై లాఠీచార్జ్ చేయలేదని, నేడు కేంద్రం అణచివేత ధోరణి ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు. నీట్ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సారంగపాణి, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, వర్ధన్నపేట సొసైటీ చైర్మన్ రాజేష్ ఖన్నా, ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, నాయకులు ఎద్దు సత్తన్న, మైస సురేష్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి.



**బయ్యారం/,జులై 24.(జర్నలిస్ట్ వార్త)** ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగును చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు అన్నారు. మండలంలోని సింగారం గ్రామపంచాయతీలో సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌నినో ప్రభావం రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు నీటి సంరక్షణ చర్యలపై ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా సాధ్యమైనంతగా వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటలు, చిరుధాన్యాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయలు, ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులు మళ్లాలని సూచించారు.వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు,ఇరిగేషన్ ఏఇ పృథ్వి,సెక్రటరి సరిత,వార్డ్ సభ్యులు చెరుకుపల్లి మనిషా,గుగులోత్ అనూష,మాజీ ఎంపిటిసి కొత్తపల్లి సీతారాములు,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగావత్ రవి నాయక్,గ్రామ రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## లారీల దెబ్బకు గుంతలమయమైన జాన్‌పహాడ్ రహదారి

**శుక్రవారం దర్గా భక్తులకు నరకయాతన.. మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి**



**దామచర్ల/జూలై 24 (జర్నలిస్ట్ వార్త):** దామచర్ల మండల కేంద్రం నుంచి జాన్‌పహాడ్ దర్గా వరకు వెళ్లే ప్రధాన రహదారి భారీ గుంతలతో అధ్వానంగా మారింది. రహదారి వెంట ఉన్న అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి సిమెంట్, డస్ట్ లారీల నిరంతర రాకపోకలతో రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రయాణానికి ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జాన్‌పహాడ్ దర్గా రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందడంతో ప్రతి శుక్రవారం వేలాది మంది భక్తులు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. అయితే రహదారిపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.దెబ్బతిన్న రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టి భక్తులు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు. అదానీ సిమెంట్ యాజమాన్యం కూడా సామాజిక బాధ్యతలో భాగంగా రహదారి మరమ్మతులకు సహకరించాలని భక్తులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## డీసీసీ అధ్యక్షుడిని కలిసిన నారపోగు వెంకటేశ్వర్లు



**ఖమ్మం/, జూలై 24 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్‌ను టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో జరిగిన ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.ఇటీవల టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమితులైన వెంకటేశ్వర్లును డీసీసీ అధ్యక్షుడు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు పార్టీ అధిష్ఠానం, జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాపా అప్పయ్య, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షదేవుని కరుణ కోసం 101 బిందెలతో కట్ట సత్తెమ్మకు జలాభిషేకం

**వర్షాలు కురిసి రైతన్న పంటలు పండాలని మహిళల ప్రత్యేక పూజలు**



**వేంసూరు/ జూలై 24 (జర్నలిస్ట్ వార్త):** ఎండల తీవ్రత, వర్షాభావంతో ఆందోళన చెందుతున్న రైతాంగానికి ఊరటనివ్వాలని కోరుతూ వేంసూరు గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సమీపంలోని పొనుగుమాడు చెరువు కట్టపై వెలసిన కట్ట సత్తెమ్మ అమ్మవారికి 101 బిందెల నీటితో జలాభిషేకం చేసి, చీర, పసుపు, కుంకుమ సమర్పించి పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారిని వేడుకుంటూ, ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. వర్షాభావంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగి సుభిక్షం నెలకొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బొంతు విజయలక్ష్మి, శ్రీదేవి, రాణి, నాగమణి, జ్యోతి, రాధమ్మ, చంటి, సరోజిని, ధనలక్ష్మి, సత్యవతి, రమ్యతో పాటు గ్రామ మహిళలు, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## నేడు కొత్తగూడెంలో జరిగే స్కాలర్‌షిప్ బకాయిల రౌండ్ టేబుల్ సమావేశానికి తరలిరండి.

**-మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్.**



**బయ్యారం/,జులై 24.(జర్నలిస్ట్ వార్త)** నేడు కొత్తగూడెంలో జరిగే స్కాలర్‌షిప్ బకాయిల రౌండ్ టేబుల్ సమావేశానికి తరలిరావాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒక్క విద్యార్థి కూడా ఉన్నత విద్యకు దూరం కాకూడదని అన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాక వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల హక్కుల సాధనలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో గల కమ్మవారి కళ్యాణ మండపంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం నిర్వహిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ బకాయిల సాధన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ అధ్యక్షులు రేగా కాంతారావు పాల్గొంటున్నారని తెలిపారు.నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు,కళాశాలల యాజమాన్యాలు,అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున హాజరై ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.